సాక్షి అనకాపల్లి

శనివారం : 28 : జూన్ : 2025



ఇదేం చర్చో?

8లో

జీవీఎంసీ స్థాయీ సంఘ సమావేశంలో నాలుగు గంటల్లో 299 అంశాలపై చర్చ జరిగింది. దీనిపై విమర్శలు వినిపిస్తున్నాయి.



నక్షత్ర హోమం

సింహాచలం: పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకుని సింహగిరిపై ఉన్న పురాతన రామాలయంలో శుక్రవారం హోమాన్ని వైభవంగా నిర్వహించారు.

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం

32.8/24.9

అనకాపల్లి: రాగల ఐదు రోజులు ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉండి, తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షం పడే అవకాశం ఉందని ఆర్‌ఏఆర్ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి శుక్రవారం తెలిపారు.

న్యూస్‌రీల్

రిటైర్డ్ హోంగార్డుకు ఆర్థిక సాయం



రామునాయుడుకు చెక్కును అందజేస్తున్న ఎస్పీ తుహిన్ సిన్హా

అనకాపల్లి: పరవాడ పోలీస్ స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహించి ఇటీవల పదవీ విరమణ పొందిన కె.రామునాయుడుకు అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల హోంగార్డులు ఒక రోజు వేతనం రూ.4,04,965 అందజేశారు. ఈ మొత్తం చెక్కును ఎస్పీ తుహిన్‌సిన్హా శుక్రవారం తన కార్యాలయంలో ఆయనకు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ హోంగార్డులు పదవి వీరమణ పొందినా, అనారోగ్య కారణంగా మృతి చెందినా హోంగార్డుల ఒక రోజు వేతనాన్ని స్వచ్ఛందంగా ఇవ్వడం అభినందనీయమన్నారు. హోంగార్డులు పోలీస్ శాఖలో ఒక భాగమేనన్నారు. విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేసిన ప్రతి ఉద్యోగికి గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో కార్యాలయ పరిపాలన అధికారి ఏ రామ్‌కుమార్, సూపరింటెండెంట్ ప్రతాప్ శేషయ్య, జూనియర్ అసిస్టెంట్ రమేష్ పాల్గొన్నారు.



మాడుగులలో జగన్నాథుని రథం లాగడానికి పోటీ పడుతున్న భక్తులు

అనకాపల్లిలో జగన్నాథుని రథం లాగుతున్న భక్తులు (ఇన్‌సెట్) రథంపై కొలువైన సుభద్ర, బలభద్ర సమేత జగన్నాథుడు

జనం మధ్య జగన్నాథుడు

అంగరంగ వైభవంగా తొలి రథయాత్ర

సుభద్ర బలభద్ర సమేత జగన్నాథుడు రథంపై కొలువుదీరారు. స్వామి దర్శనంతో భక్తులు పులకించిపోయారు. రథం లాగేందుకు పోటీ పడ్డారు. గవరపాలెం మర్రిచెట్టు వద్ద కొలువైన శ్రీ సుభద్ర బలభద్ర సమేత జగన్నాథ స్వామి తొలి రథ యాత్ర శుక్రవారం ఘనంగా జరిగింది. ఉదయం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన రథంపై స్వామివారిని అధిష్ఠింపజేశారు. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ స్వామివారికి పూజలు నిర్వహించి రథ యాత్రను ప్రారంభించారు. రథం ఆలయం నుంచి గవరపాలెం పురవీధుల మీదుగా చిననాలుగురోడ్ల జంక్షన్, కోట్నివీధి, మళ్ల వీధి మీదుగా సాగి రాత్రి తొమ్మిది గంటల సమయంలో ఇంద్రద్యుమ్న హాల్‌కు చేరుకుంది. ఇక్కడ తొమ్మిది రోజులపాటు రోజుకొక అవతారంలో ప్రజలకు స్వామివారు దర్శనమిస్తారు. ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ దాడి బుజ్జి, ఆలయ సహాయ కమిషనర్ సుధారాణి తదితరులు పాల్గొన్నారు. డీఎస్పీ శ్రావణి ఆధ్వర్యంలో సీఐలు టీవీ విజయ్‌కుమార్, వెంకటనారాయణ, ఎస్ఐ అల్లు వెంకటేశ్వరావు భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. మాడుగులలో జగన్నాథుని రథయాత్ర శుక్రవారం అంగరంగ వైభవంగా జరిగింది. జగన్నాథస్వామి ఆలయం నుంచి నూతన ఇంద్రద్యుమ్న హాల్ వరకు మంగళ వాయిద్యాలు, భజనల నడుమ కన్నుల పండువగా రథ యాత్ర సాగింది. - అనకాపల్లి టౌన్/మాడుగుల

నేడు వైఎస్సార్‌సీపీ జిల్లా విస్తృత స్థాయి సమావేశం

- ముఖ్యఅతిథులుగా శాసనమండలి విపక్ష నేత బొత్స, రీజినల్ కోఆర్డినేటర్ కురసాల కన్నబాబు
- జిల్లాలో కేడరంతా హాజరు కావాలని అమర్‌నాథ్ పిలుపు



మాజీ మంత్రి, పార్టీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్

సాక్షి, విశాఖపట్నం:

పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు శనివారం మధ్యాహ్నం 3 గంటలకు వైఎస్సార్‌సీపీ జిల్లా విస్తృత స్థాయి సమావేశం జరగనుంది. జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఆధ్వర్యంలో అనకాపల్లి టౌన్‌లోని పెంటకోట కన్వెన్షన్ హాల్లో నిర్వహించే ఈ కార్యక్రమానికి శాసన మండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ, ఉత్తరాంధ్ర రీజినల్ కోఆర్డినేటర్ కురసాల కన్నబాబు, పీఏసీ కమిటీ సభ్యుడు బూడి ముత్యాలనాయుడు, పార్లమెంట్ సమన్వయకర్త, నియోజకవర్గ సమన్వయకర్తలు హాజరు కానున్నారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు అమర్‌నాథ్ మాట్లాడుతూ ఏడాది కూటమి పాలనలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా చేసిన మోసాలను గడప గడపకు వెళ్లి ఎండగట్టేందుకు నిర్వహించే 'బాబు షూరిటీ.. మోసాలు గ్యారెంటీ' పేరిట వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. ఆరు వారాల పాటు జిల్లా, మండల, గ్రామ స్థాయుల్లో ప్రజల వద్దకే వెళ్లి క్యూఆర్ కోడ్ ద్వారా కూటమి మేనిఫెస్టోలో ఏమైతే హామీలు ఇచ్చారో.. వాటిలో ఏ పథకాలు ఇచ్చారో.. ఎన్ని ఎగవేశారో స్పష్టంగా తెలియజేస్తామన్నారు. క్యూఆర్ కోడ్ ద్వారా 2024 ముందు కూటమి పార్టీలు ఇచ్చిన మేనిఫెస్టోను డౌన్లోడ్ చేసుకునే విధంగా టెక్నాలజీ కల్పించామన్నారు. ఈ సమావేశానికి జిల్లాలో అన్ని నియోజకవర్గాల్లో జెడ్పీటీసీలు, పార్టీ మండల అధ్యక్షులు, ఎంపీపీలు, జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కార్యకర్తలు హాజరు కావాలని పిలుపునిచ్చారు.



కంటైనర్ లారీని ఢీకొన్న వ్యాన్

పూల కోసం వెళ్లి మృత్యు ఒడిలోకి..

- హైవేలో అకస్మాత్తుగా ఆగిన కంటైనర్ లారీ
- కడియం నుంచి పూలు తెస్తున్న బొలేరో వ్యాన్ ఢీ
- వ్యాన్ డ్రైవర్ సహా మహిళ దుర్మరణం
- మరో మహిళకు తీవ్ర గాయాలు
- జమాదులపాలెంలో ఘటన

కశింకోట: జమాదులపాలెం జంక్షన్ వద్ద జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. శుక్రవారం వేకువజామున 2 గంటల ప్రాంతంలో హైదరాబాద్ నుంచి కోల్‌కత్తాకు వెళ్తున్న కంటైనర్‌ను బొలేరో వ్యాన్ ఢీకొంది. దాంతో వ్యాన్ డ్రైవర్ సహా ఒక మహిళ దుర్మరణం చెందారు. మరొక మహిళ తీవ్రంగా గాయపడ్డారు. సీఐ అల్లు స్వామినాయుడు వివరాల ప్రకారం.. కశింకోట మండలం తీడ గ్రామానికి చెందిన పూల వ్యాపారి కన్నూరు లక్ష్మి(40)తో పాటు మరో మహిళ తూర్పు గోదావరి జిల్లా కడియం వద్ద పూలు కొనుగోలు చేసి గాజువాకలో అమ్మకానికి వ్యాన్‌లో తరలిస్తున్నారు. ఈ క్రమంలో యలమంచిలి నుంచి అనకాపల్లి వైపు వస్తున్న ఈ వ్యాన్ అదేమార్గంలో ముందు వెళ్తూ అకస్మాత్తుగా ఆగిన కంటైనర్ లారీని బలంగా ఢీకొంది. దీంతో కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం ర్యాలీ గ్రామానికి చెందిన వ్యాన్ డ్రైవర్ పి. సత్యనారాయణ (25), పూల వ్యాపారి లక్ష్మి(40) తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందారు. అనకాపల్లి మండలం కోడూరుకు చెందిన పూల వ్యాపారి ఎన్. వరలక్ష్మి (40) తీవ్రంగా గాయపడింది. వెంటనే సంఘటనా స్థలానికి చేరిన సీఐ స్వామినాయుడు, ఎస్ఐ లక్ష్మణరావులతోపాటు పోలీసులు క్షతగాత్రురాలిని అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం వైద్యుల సలహాపై విశాఖ కేజీహెచ్‌కు తరలించారు.

కేబిన్‌లో ఇరుక్కున్న మృతదేహాలు..

వ్యాన్ డ్రైవర్ పక్క సీటులో లక్ష్మి కూర్చొంది. దీంతో అతడితోపాటు ఆమె కూడా మృత్యువాత పడింది. ప్రమాదంలో వ్యాన్ ముందు భాగం నుజ్జునుజ్జయింది. దీంతో మృతదేహాలు చిక్కుకోవడంతో కేబిన్ నుంచి బయటకు అతికష్టం మీద పోలీసులు వెలికితీసి అనకాపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు. ప్రమాదం వల్ల వాహనాల ప్రయాణానికి అంతరాయం కలిగింది. ఈ నేపథ్యంలో పోలీసులు క్రేన్ సహాయంతో ప్రమాద వాహనాలను రోడ్డుపై తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

కన్నీరుమున్నీరైన కుటుంబ సభ్యులు

ప్రమాదంలో మృతి చెందిన వారిలో లక్ష్మిది పేద కుటుంబం. భర్త వరహాలు గాజువాక వద్ద కళాసీ పని చేస్తున్నాడు. లక్ష్మి నాలుగేళ్లుగా కడియం నుంచి పూలు తెచ్చి గాజువాకలో అమ్ముకుని భర్తకు చేదోడు వాదోడుగా ఉంటోంది. ఆమె పెద్ద కుమార్తె మాధవి తిరుపతిలో డీ ఫార్మసీ, చిన్న కుమార్తె కావేరి స్థానికంగా ఇంటర్మీడియట్ చదువుతున్నారు. ఈ నేపథ్యంలో తల్లి లక్ష్మి రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో వారు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. మృతురాలు లక్ష్మి భర్త వరహాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ కె. లక్ష్మణరావు తెలిపారు.



వ్యాన్‌లో చిక్కుకున్న డ్రైవర్ సత్యనారాయణ మృతదేహం, (ఇన్‌సెట్) సత్యనారాయణ (ఫైల్)



వ్యాన్‌లో చిక్కుకున్న కన్నూరు లక్ష్మి మృతదేహం, (ఇన్‌సెట్) కన్నూరు లక్ష్మి (ఫైల్)

ప్రాణాలకు తెగిస్తేనే పాఠాలు

- నాటు పడవలో.. బురదలో కాలినడకన రాకపోకలు
- 5 కి.మీ దూరంలో ఉన్న బడికి ప్రమాదకర ప్రయాణం
- అనంతగిరి మండలం సొలబంగు బాలల అవస్థలు
- దేవరాపల్లి మండలం తామరబ్బ పాఠశాలలో చదువు
- గ్రామానికి రోడ్డు, బడి లేక చిన్నారుల ఇక్కట్లు
- పిల్లలు ఇంటికి చేరుకునే వరకు భయాందోళనలో తల్లిదండ్రులు

గుండె తరుక్కుపోయే కఠిన వాస్తవం.. చదువు కోసం చిన్నారులు ప్రాణాలకు తెగించి చేస్తున్న ప్రమాదకర ప్రయాణం.. పడవపై రైవాడ జలాశయం దాటి, కొండలు గుట్టల్లో నడిచి, పొరుగు జిల్లా పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న బాలల సాహస కృత్యం.. వారి దీనావస్థ కఠిన హృదయులను సైతం కదిలిస్తుంది.. గిరిజన ప్రాంతంలో పుట్టిన పాపానికి ఆ అడవి బిడ్డలు పడుతున్న కష్టం పగవారికి కూడా వద్దనిపిస్తుంది.



నాటు పడవపై తామరబ్బ పాఠశాలకు పయనమైన సొలబొంగు విద్యార్థులు



కర్రల సహాయంతో బురద రోడ్డులో పాఠశాలకు నడిచి వెళ్తున్న చిన్నారులు



తామరబ్బ పాఠశాలలో పాఠాలు వింటూ..

దేవరాపల్లి:

రైవాడ జలాశయానికి ఆవల.. అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం పరిధిలోని గిరిజన ప్రాంతం ఉంది. పినకోట పంచాయతీ శివారు సొలబొంగు గ్రామానికి చెందిన బాలలు చదువు కోసం ప్రాణాలకు తెగించి, అక్కడి నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. రహదారి, పాఠశాల లేకపోవడంతో ఈ గ్రామానికి చెందిన 12 మంది విద్యార్థులు దేవరాపల్లి మండల పరిధిలోని తామరబ్బ ఎంపీయూపీ పాఠశాలకు పడవపైన, కాలినడకన వచ్చి చదువుకుంటున్నారు. సొలబొంగు నుంచి తామరబ్బకు చేరుకోవాలంటే రెండు మార్గాలు. వీరభద్రపేట మీదుగా పొలాల గట్లపై జారు బురదలో సుమారు 5 కిలోమీటర్ల మేర కాలినడకన చేరుకోవాలి. వర్షం పడితే ఈ మార్గంలో రాకపోకలు సాగించడం కష్టం. దీనికి ప్రత్యామ్నాయంగా సొలబొంగు నుంచి నాటు పడవపై రైవాడ జలాశయంలో సుమారు 3 కిలోమీటర్ల మేర ప్రయాణించి, దేవరాపల్లి మండల పరిధిలోని లోవ ముకుందపురం గ్రామానికి చేరుకొని.. అక్కడి నుంచి మళ్లీ ఒక కిలోమీటరు మేర చెట్లు, పుట్టల గుండా కర్రలు చేత పట్టుకొని ప్రయాణించి తామరబ్బ పాఠశాలకు చేరుకోవాలి. ప్రస్తుతం విస్తారంగా వర్షాలు కురవడంతో విద్యార్థులు పడవపైనే పాఠశాలకు రాకపోకలు సాగిస్తున్నారు. వారు తిరిగి ఇంటికి చేరుకునే వరకు తల్లిదండ్రులు తీవ్ర భయాందోళనలు చెందుతున్నారు. ప్రమాదమని తెలిసినా గత్యంతరం లేని పరిస్థితుల్లో పాఠశాలకు పంపిస్తున్నామని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీరభద్రపేట రోడ్డు నిర్మాణ పనులను అసంపూర్తిగా నిలిపివేయడంతో తమకు మరిన్ని కష్టాలు వెంటాడుతున్నాయని సొలబొంగు గ్రామస్తులు వాపోతున్నారు. ఈ గ్రామంలో 16 గిరిజన కుటుంబాలు నివసిస్తున్నాయి. సుమారు 70 మంది వరకు జనాభా ఉన్నారు. ప్రస్తుతం 12 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. గ్రామస్తులు సైతం నిత్యావసర సరకుల కోసం పడవపైన, లేదా వీరభద్రపేట మీదుగా తామరబ్బ వైపునకు చేరుకోవాల్సిన పరిస్థితి. ఈ గ్రామానికి చెందిన గర్భిణులు ఆసుపత్రికి చేరుకోవాలంటే సుమారు 15 కిలోమీటర్ల దూరంలోని దేవరాపల్లి ఆసుపత్రే దిక్కు.

దారీ తెన్నూ లేదు



మా గ్రామానికి దారీ తెన్నూ లేదు. మా గ్రామంలో బడి లేక పిల్లల్ని దేవరాపల్లి మండలంలోని తామరబ్బ స్కూల్‌కు పంపిస్తున్నాం. నా కుమార్తె అంజలి 4వ తరగతి చదువుతోంది. సుమారు 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న పాఠశాలకు పొలాల గట్ల మీదుగా తుప్పలు, డొంకలను దాటుకుంటూ నడిచి వెళ్తున్నారు. వర్షం కురిస్తే కాలినడక మార్గం బురదమయంగా మారుతుంది. ప్రభుత్వం స్పందించి మా పిల్లలు పడుతున్న కష్టాలను తీర్చాలి.

– దిప్పల దేముడుబాబు, విద్యార్థిని తండ్రి, సొలబొంగు

ప్రభుత్వం స్పందించాలి



మాకు ఎలాగూ చదువు లేదు.. మా పిల్లలనైనా చదివించాలని ఆశ పడుతున్నాం. నా కూతురు శివజ్యోతి ఒకటో తరగతి చదువుతోంది. ప్రస్తుత వర్షాలకు వీరభద్రపేట మార్గం అడుగు తీసి అడుగు వేయలేని విధంగా బురదమయంగా మారింది. ప్రమాదమని తెలిసినా తప్పని పరిస్థితుల్లో నాటు పడవలపై పిల్లలను లోవ ముకుందపురం వరకు పంపిస్తున్నాం. ప్రభుత్వం స్పందించి మా గ్రామానికి బడి, రోడ్డు సౌకర్యం కల్పించి ఆదుకోవాలి.

–గమ్మెల రాజు, విద్యార్థిని తండ్రి, సొలబొంగు

అధికారుల్లో కదలిక

- 5 కి.మీ. నడిచి అర్ల పంచాయతీ చేరుకున్న డీఈవో, తహసీల్దార్, ఎండీపీవో
- ఎస్‌ఆర్‌ఎస్‌టీసీ స్కూలు పునఃప్రారంభానికి హామీ
- అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటుకు సిఫారసు



గిరిజన గ్రామాలకు కాలినడకన వెళుతున్న డీఈవో అప్పారావునాయుడు, తహసీల్దార్ నాగమ్మ, ఎంపీడీవో నాగేశ్వరరావు

రోలుగుంట: అర్ల గిరిజన పంచాయతీ శివారు కొండ శిఖరాగ్రాన గల గిరిజన గ్రామాల విద్యార్థుల అవస్థల గురించి తెలుసుకొని అధికారులు స్పందించారు. ఆ చిన్నారుల నడకయాతన గురించి పత్రికల్లో వచ్చిన కథనాలు వారిలో కదలిక తీసుకువచ్చాయి. జిల్లా విద్యాశాఖాధికారి గిడ్డి అప్పారావు నాయుడు శుక్రవారం రోలుగుంట వచ్చారు. ఎంఈవో జానుప్రసాద్, తహసీల్దార్ ఎస్.నాగమ్మ, ఎంపీడీవో వి.ఎస్.నాగేశ్వరరావులతో కలిసి అయిదు కిలోమీటర్లు పైబడి కొండపైకి కాలినడకన చేరుకున్నారు. పెదగరువు, కొత్తలోసింగి, పాతలోసింగి గ్రామాలకు చెందిన విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశమై సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు తమ సమస్యలు ఏకరువు పెట్టారు. తమ పిల్లలు చదువు కోసం ఆరు కిలోమీటర్ల దూరంలోని వై.బి.పట్నం, 10 కిలోమీటర్ల దూరంలోని బి.బి.పట్నం గ్రామాలకు కాలినడకన వెళుతున్నారని వారి కష్టాలు చెప్పుకున్నారు. గతేడాది సెప్టెంబర్‌లో తమ అభ్యర్థన మేరకు గ్రామంలోనే ఎస్‌ఆర్‌ఎస్‌టీసీ స్కూలు నిర్వహించారని, ఈ ఏడాది పునఃప్రారంభించలేదని వివరించారు. తమ గ్రామాల్లో పూర్తిస్థాయిలో పాఠశాల ఏర్పాటు చేయాలని కోరారు. గతంలో ఈ గ్రామాలకు రూ.2.50 లక్షలు మంజూరైతే తూతూమంత్రంగా పనులు చేశారని, వర్షాలకు కొట్టుకుపోయి యథాస్థితికి వచ్చిందన్నారు. రవాణా మార్గం లేక రోగులను చికిత్స కోసం డోలీలో తరలించాల్సి వస్తుందన్నారు. డీఈవో అప్పారావునాయుడు కొత్తలోసింగి, పాతలోసింగి గ్రామాల్లో ఒకటి నుంచి అయిదు వరకు చదువుతున్న 22 మంది విద్యార్థులు ఉన్నారని, పెదగరువు గ్రామంలో బడి ఈడు పిల్లలు అయిదుగురు ఉన్నట్టు గుర్తించి వై.బి.పట్నం ఎంపీపీ పాఠశాల హెచ్‌ఎం ఏకా నర్సింహమూర్తిని రప్పించి హాజరు పట్టీని సరిపోల్చారు. సంతృప్తి చెందిన ఆయన ఎస్‌ఆర్‌ఎస్‌టీసీ స్కూలును మళ్లీ ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. అయిదు సంవత్సరాల లోపు వయసున్న చిన్నారుల కోసం అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్‌కు నివేదిస్తామని చెప్పారు. గిరిజన సంఘ నాయకులు కె.గోవింద, ఆ గ్రామాల పెద్దలు కిలో నర్సయ్య, వెంకట్రావు పాములు, సత్తిబాబు, సీఆర్పీ సతీష్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులు, వారి తల్లిదండ్రులను అడిగి సమస్యలు తెలుసుకుంటున్న అధికారులు

క్లుప్తంగా

అల్లూరి జయంతి ఏర్పాట్లు పరిశీలన



మాట్లాడుతున్న ఆర్డీవో రమణ

గొలుగొండ: అల్లూరి పార్కులో వచ్చే నెల 4న అల్లూరి జయంతి ఘనంగా నిర్వహించేందుకు మండల స్థాయి అధికారులు సర్వం సిద్ధం చేయాలని నర్సీపట్నం ఆర్డీవో వి.వి. రమణ ఆదేశించారు. కృష్ణదేవిపేట గ్రామంలో అల్లూరి సమాధుల ప్రాంతాన్ని శుక్రవారం సాయంత్రం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అధికారకంగా నిర్వహించే ఈ కార్యక్రమానికి అన్ని ఏర్పాటు పక్కాగా ఉండాలని తహసీల్దార్ శ్రీనువాసరావుకు సూచించారు. ఆ రోజు రాష్ట్రంలో ముఖ్య నాయకులు హాజరయ్యే అవకాశం ఉందన్నారు. అధికారులకు అల్లూరి ఉత్సవ కమిటీ సహకారం అందించాలని కోరారు.

పొలాలకు నీరు విడుదల



వడ్డాదిలో గేటు ఎత్తి నీరు విడుదల చేస్తున్న రైతు సంఘ నాయకులు

బుచ్చెయ్యపేట: పెద్దేరు రిజర్వాయర్ నుంచి వచ్చే నీటిని కస్పా పొలాలకు శుక్రవారం విడుదల చేశారు. స్థానిక రైతు సంఘం నాయకులు దాడి పెద గోవింద,దాడి చిన గోవింద తదితర్లు వడ్డాదిలో కస్పా కాలువపై ఉన్న గేట్లు ఎత్తి సాగు నీరు విడుదల చేశారు. వడ్డాది,చిన అప్పనపాలెం ,పోలేపల్లి,గౌరీపట్నం,దిబ్బిడి, బుచ్చెయ్యపేట తదితర గ్రామాలకు చెందిన రైతులకు ఈ కాలువ కింద భూములన్నాయి. ఖరీఫ్ సీజన్ ప్రారంభమవడంతో రైతులు వరి ఆకుమడులు వేసేందుకు నీరు విడుదల చేశారు.

గుడి,బడి ధ్యాసే లేదు..

గల్లీగల్లీలో 'బెల్ట్' లొల్లి

గ్రామాల్లో బెల్టుషాపుల జోరు కొనసాగుతోంది. గల్లీగల్లీలో మందు దొరుకుతోంది. అర్ధరాత్రి వరకూ దుకాణాలు కిటకిటలాడుతున్నాయి. ఎమ్మార్పీ కంటే రేటు పెంచి అదనపు లాభాలు ఆర్జిస్తున్నారు. దీంతో మద్యం బాబుల జేబులకు చిల్లులు పడుతున్నాయి. మరో వైపు గుడి, బడి సమీపంలో షాపులు నిర్వహిస్తుండడంతో పూటుగా తాగిన మందుబాబులు వీరంగం సృష్టిస్తూ విద్యార్థులను, భక్తులను భయాందోళనలకు గురి చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా ఎక్సైజ్ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు.

- విచ్చలవిడిగా మద్యం విక్రయాలు
- భయాందోళనలలో గొడిచర్లలో పాఠశాల విద్యార్థులు
- మామూళ్ల మత్తులో ఎక్సైజ్ అధికారులు



బెల్టుషాపు ముందు బైక్‌పైనే మద్యం సేవిస్తున్న మందుబాబులు

నక్కపల్లి: కూటమిప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మద్యం ఏరులై పారుతోంది. ఇష్టానుసారం బెల్టుషాపులు ఏర్పాటు చేస్తున్నారు. బడి, గుడి అన్న ధ్యాసే లేకుండా ఎక్కడపడితే ఏర్పాటు చేసేస్తున్నారు. గొడిచర్ల జెడ్పీ ఉన్నత పాఠశాలకు అతి సమీపంలో జగన్నాథపురం వెళ్లే రూట్లో బెల్టుషాపు ఏర్పాటు చేసి, విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు చేపడుతున్నారు. బెల్ట్‌షాపు ముందు నుంచే జగన్నాథపురం, ముకుందరాజుపేట, దోసలపాడు, చీడిక , కొత్తూరు, రమణయ్యపేట, రేబాక,తిరుపతిపాలెం, గుల్లిపాడు గ్రామాలనుంచి ప్రతిరోజు వందలాది మంది విద్యార్థులు రాకపోకలు సాగిస్తూ గొడిచర్ల పాఠశాలలో చదువుకుంటున్నారు.దాదాపు 800 మందికి పైగా విద్యార్థులు సుమారు 3నుంచి 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ గ్రామాలనుంచి గొడిచర్ల పాఠశాలకు కాలినడక, సైకిళ్లపై, ఆటోల్లో వస్తారు. ఈ మార్గంలో బెల్టుషాపు ఉండడంతో విద్యార్థులు భయాందోళనలు చెందుతున్నారు. ఈ బెల్టుషాపునకు సమీపంలోనే గ్రామ దేవతల ఆలయాలు కూడా ఉన్నాయి. పాఠశాలలో విద్యార్థులకు సరిపడా మరుగుదొడ్లు లేకపోవడంతో విద్యార్థినీవిద్యార్థులు కాలకృత్యాలు తీర్చుకునేందుకు బెల్టుషాపు పరిసరప్రాంతాలను వినియోగిస్తారు. సాయంత్రం పాఠశాల ముగిసిన తర్వాత బెల్టుషాపు ముందునుంచే రాకపోకలు సాగించవలసి రావడంతో మద్యం మత్తులోఎవరు ఎప్పుడు అసభ్యకరంగా ప్రవర్తిస్తారోనన్న భయంతో బాలికలు ఆందోళన చెందుతున్నారు. లైసెన్సు పొందిన దుకాణాల యజమానులే గ్రామాల్లో అమ్మకాలను పెంచడం కోసం బెల్టుషాపులను ప్రోత్సహిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అన్ని బెల్ట్‌షాపుల్లోను ఎంఆర్‌పీ కంటే రూ.50 నుంచి రూ.100 అధికంగా వసూలు చేస్తున్నారు. క్వార్టర్ బాటిల్ ఎంఆర్‌పీ రూ.100 ఉంటే గ్రామాల్లో బెల్టుషాపుల్లో రూ.150 వసూలు చేస్తున్నారు. బీరు బాటిల్‌కు రూ.50 నుంచి రూ.100 ఎక్కువ వసూలు చేస్తున్నారు.

ఉపమాక వెంకన్న ఆలయానికి వెళ్లే రోడ్డులో..

రాష్ట్రంలోనే ప్రసిద్ధి గాంచి, తిరుమల తిరుపతి దేవస్థానం వారు దత్తత తీసుకున్న ఉపమాక వేంకటేశ్వర స్వామి ఆలయానికి వెళ్లే రోడ్డులోకూడా రెండు మద్యం దుకాణాలకు కూటమి ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. విక్రయాలే కాకుండా షాపు వద్దే సేవించేందుకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు.

ఈ రహదారిలో మద్యం దుకాణాల ఏర్పాటుకు అనుమతి ఇవ్వడాన్ని చూసి భక్తులు విస్తుబోతున్నారు. నిబంధనల ప్రకారం లైసెన్స్ కలిగిన బార్ల వద్ద మాత్రమే మద్యం సేవించాల్సి ఉంటుంది.కానీ నక్కపల్లి మండలంలో షాపుల వద్ద ఎంచక్కా సకల సదుపాయాలు కల్పించి అక్కడే తాగే ఏర్పాట్లు చేస్తున్నారు.

యాదవ విద్యార్థులకు పురస్కారాలు రేపు

అనకాపల్లి: ఈ ఏడాది పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన యాదవ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేయనున్నట్లు జిల్లా యాదవ సంక్షేమ సంఘం అధ్యక్షుడు భరణికాన బాబూరావు, మండలాధ్యక్షుడు పంచదార్ల కన్నారావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక గవరపాలెం నూకాంబిక రహదారి సత్యలక్ష్మీ గ్రాండ్ ఫంక్షన్ హాల్లో ఆదివారం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

జిల్లాలో పదో తరగతిలో 550 మార్కులు, ఇంటర్మీడియట్‌లో 900 మార్కులుపైగా సాధించిన యాదవ విద్యార్థులకు పురస్కారాలు అందజేస్తామన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడు అప్పలనాయుడు మృతి

- మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు సంతాపం



అప్పలనాయుడు

దేవరాపల్లి: మండలంలోని తారువ వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు గొంప అప్పలనాయుడు శుక్రవారం మృతిచెందారు. అప్పలనాయుడు తారువ సర్పంచ్ గొంప వరహాలమ్మ భర్త, మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడుకు స్వయాన బావ. అప్పలనాయుడు భౌతికకాయానికి మాజీ డిప్యూటీ బూడి పూల మాల వేసి నివాళులర్పించారు. మాడుగుల నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, అధికార్లు అధిక సంఖ్యలో తరలివచ్చి నివాళులర్పించారు. స్థానిక జెడ్పీటీసీ కర్రి సత్యం, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూరె బాబురావు, స్థానిక వైస్ ఎంపీపీ పంచాడ సింహాచలంనాయుడు, పార్టీ చీడికాడ మండల అధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు, కురచా నారాయణమూర్తి, లాలం జానకీరామ్, కె.వి.రమణ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు శ్రద్ధాంజలి ఘటించారు.

అన్ని శాఖల సమన్వయంతో రోడ్డు భద్రతా చర్యలు



రోడ్డు భద్రతపై అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎస్పీ తుహిన్ సిన్హా

- ఎస్పీ తుహిన్ సిన్హా

పరవాడ: రోడ్డు భద్రతను మరింత బలోపేతం చేయడానికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా సూచించారు. అనకాపల్లి–విశాఖ జాతీయ రహదారి లంకెలపాలెం కూడలిలో ఈ నెల 23న జరిగిన ఘోర రోడ్డు ప్రమాద స్థలాన్ని ఆయన శుక్రవారం సందర్శించారు. ప్రమాదం తీరు తెన్నులను ట్రాఫిక్ పోలీసు అధికారులను అడిగి తెలుసుకున్నారు. రోడ్డు భద్రత పరిరక్షణ చర్యలపై రోడ్డు ఇంజినీరింగ్‌లో తగు మార్పులు చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై జిల్లా రవాణాశాఖ అధికారి జి.మనోహర్, పరవాడ డీఎస్పీ విష్ణు స్వరూప్‌లతో సమీక్ష జరిపారు. అలాగే ప్రమాద స్థలంలో ట్రాఫిక్ నిబంధనలు అమలు, వేగ నియంత్రణ, సిగ్నల్ వ్యవస్థ నిర్వహణ, ప్రమాదకరంగా ఉన్న మలుపులు, డివైడర్లు, సైన్ బోర్డుల ఏర్పాటు తదితర అంశాలపై సమీక్ష జరిపి, సూచనలిచ్చారు. ఇక్కడ జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురు వ్యక్తులు మృత్యువాత పడగా 15 మంది గాయపడ్డారని, క్షతగాత్రులు వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారని పోలీసు అధికారులు ఎస్పీకి వివరించారు. సమీక్షలో రవాణా శాఖాధికారి జి.మనోహర్, పరవాడ సబ్‌డివిజన్ డీఎస్పీ వి.విష్ణుస్వరూప్, మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ కె.ప్రవీణ్‌కుమార్, పి.గోపీకృష్ణ, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

సతీష్ ఇంటికి కుళాయి

- ప్రతిష్టాత్మకంగా తీసుకున్న జనసేన నేతలు
- సూపర్ సర్పంచ్‌పై హోం మంత్రికి ఫిర్యాదు



పోలీసులు, అధికారుల సమక్షంలో సతీష్ ఇంటి వద్ద కుళాయి పనులు

నక్కపల్లి/ ఎస్‌రాయవరం: జనసేన కార్యకర్త ఇంటికి కుళాయి ఏర్పాటు వ్యవహారాన్ని పార్టీ నేతలు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. టీడీపీకి చెందిన సూపర్ సర్పంచ్ వ్యవహారాన్ని హోం మంత్రి దృష్టికి తీసుకెళ్లి ఎట్టకేలకు తమ పార్టీకి చెందిన సతీష్ ఇంటికి పోలీసులు, అధికారుల సాయంతో శుక్రవారం కుళాయి ఏర్పాటు చేశారు. ఎస్.రాయవరం మండలం జేవీపాలెంలో జనసేన గ్రామశాఖ అధ్యక్షుడు సతీష్ ఇంటికి కుళాయి వేయకుండా స్థానిక సూపర్ సర్పంచ్, మండల టీడీపీ సమన్వయకమిటీ సభ్యుడు వజ్రపు శంకర్రావు అడ్డుపడిన విషయం తెలిసిందే. అధికారుల దృష్టికి తీసుకెళ్లి కుళాయి వేయించుకునే పనులు ప్రారంభించడంతో సతీష్‌పై, అతని తల్లిపై శంకర్రావు గురువారం దాడికి పాల్పడ్డాడు. దీనిపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గెద్దం బుజ్జి, రాష్ట్ర సివిల్ సప్లైస్ కార్పొరేషన్ డైరెక్టర్ బోడపాటి శివదత్ తదితరులు బాధిత కుటుంబానికి అండగా నిలిచి సతీష్ ఇంటికి కుళాయి వేసే ప్రక్రియ పూర్తి చేశారు. ఈ పరిణామంతో రెండు పార్టీల మధ్య అగాధం మరింత పెరిగే అవకాశం ఉందని కూటమి నేతలు చర్చించుకుంటున్నారు.

టీడీపీలో ముసలం.!

- మునగపాక మండలంలో వర్గాలుగా చీలిపోయిన క్యాడర్
- ఓ వర్గం జనసేన ఎమ్మెల్యే సుందరపుతో అంటకాగుతున్న వైనం
- నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ప్రగడ వైపు మరోవర్గం
- టీడీపీ మండల కమిటీల నియామకంతో రచ్చకెక్కిన నాయకులు
- ఆత్మీయ సమావేశం పేరిట మునగపాకలో ఓ వర్గం సమావేశం
- హాజరు కాని ప్రగడ, ఆయన అనుచరులు

మునగపాక: మునగపాక మండలం టీడీపీలో వర్గపోరు నడుస్తోంది. ఇంత వరకు గుట్టుచప్పుడు కాకుండా పెరుగుతూ వచ్చిన అసంతృప్తి ఒక్కసారిగా పెల్లుబికింది. ఇందుకు పార్టీలో ఇటీవల నియమించిన నూతన కార్యవర్గాలే ప్రధాన కారణమని చర్చించుకుంటున్నారు. నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావుకు, ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అనుచరులుగా చెలామణి అవుతున్న టీడీపీ శ్రేణుల మధ్య గత కొంత కాలంగా విబేధాలు ఉన్నాయి. దీంతో రెండు గ్రూపులుగా విడిపోయారు. పార్టీ మండల మాజీ అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాసరావు, పార్టీ సీనియర్ నాయకులు దాడి ముసిలినాయుడు, మొల్లేటి సత్యనారాయణ ఒక వర్గంగా ఉంటూ ఎమ్మెల్యే విజయకుమార్‌కు అనుచరులుగా కొనసాగుతున్నారు. మరికొంత మంది ప్రగడ నాగేశ్వరరావు వర్గీయులుగా చెలామణి అవుతున్నారు. ఈ క్రమంలో టీడీపీలో ఇటీవల నూతన కమిటీల నియామకం చేపట్టారు. ఈ నియామకంలో భాగంగా మునగపాకకు చెందిన పెంటకోట విజయ్‌ను పార్టీ మండల అధ్యక్షుడిగా ప్రకటించారు. ఎమ్మెల్యే అనుచరులుగా ఉంటున్న టీడీపీ నాయకులు ఈ నియామకాన్ని తట్టుకోలేకపోతున్నారు.

దీంతో శుక్రవారం మునగపాకలో శ్రీనివాసరావు, ముసిలినాయుడు, సత్యనారాయణ తదితరులు ఆత్మీయ సమావేశం పేరిట కార్యకర్తల సమావేశం నిర్వహించారు. మొదటి నుంచి టీడీపీలో కష్టపడి పనిచేసిన వారికి కాకుండా ఇతరులకు కమిటీల్లో ఎలా నియామకాలు చేస్తారంటూ ఆవేదన వెల్లగక్కారు. కార్యకర్తల అభీష్టం మేరకు కమిటీల ఎన్నికలు జరగాల్సి ఉన్నా.. నియోజకవర్గ టీడీపీ నేతలు కొంత మందిని ప్రోత్సహించేలా కమిటీల నియామకం చేపట్టారంటూ బాహాటంగా విమర్శలు గుప్పించారు. తాము ఎక్కడా పార్టీ సిద్ధాంతాలకు వ్యతిరేకంగా పని చేయకున్నా తమను పక్కన పెట్టారని పలువురు తమ ఆక్రోశాన్ని వెల్లగక్కారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి సత్తా చాటాలంటే పార్టీలో నెలకొన్న విబేధాలను సరి చేయాలని, లేకుంటే ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీకి అవకాశం ఇచ్చినట్లవుతుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు. పార్టీలో క్రమశిక్షణ లోపిస్తుందని, పెద్దలు జోక్యం చేసుకొని కార్యకర్తల అభీష్టం మేరకు కమిటీలు వేయాలని కోరుతూ సమావేశంలో తీర్మానం చేశారు. పార్టీ జిల్లా, రాష్ట్ర అధ్యక్షులతో పాటు మంత్రి లోకేష్ దృష్టికి కార్యకర్తలకు జరిగిన అన్యాయాన్ని తీసుకువెళ్లాలని నిర్ణయించారు. మొత్తమ్మీద మండల టీడీపీలో విబేధాలు మరోసారి రచ్చకెక్కడంతో రానున్న రోజుల్లో ఏం జరుగుతుందో వేచి చూడాలి.



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకుడు ముసిలినాయుడు

21న ఓటరు జాబితా విడుదల

- 30 లోపు అభ్యంతరాల స్వీకరణ
- ఈవీఎం గోదాములు తనిఖీలో డీఆర్వో సత్యనారాయణరావు



ఈవీఎం గొడౌన్ తనిఖీ చేస్తున్న డీఆర్వో సత్యనారాయణ రావు, ఆర్డీవో షేక్ ఆయిషా, రాజకీయ పార్టీల ప్రతినిధులు

తుమ్మపాల: ఓటరు జాబితా తయారీ ప్రక్రియలో సమస్యలు, పొరపాట్లు వంటి అభ్యంతరాలు ఉంటే రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ దృష్టికి తీసుకురావాలని జిల్లా రెవెన్యూ అధికారి వై. సత్యనారాయణరావు తెలిపారు. త్రైమాసిక తనిఖీలో భాగంగా గురువారం స్థానిక ఎస్పీ కార్యాలయం ప్రాంగణంలో ఈవీఎం గోదాములను ఆర్డీవో షేక్ ఆయిషా, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి తనిఖీ చేసి ప్రధాన ద్వారానికి ఉన్న సీళ్లను, సీసీకెమెరాల పనితీరును పరిశీలించారు. తాళాలు తీయించి గోదాముల లోపల ఈవీఎంలను, అగ్నిమాపక పరికరాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. భద్రతా ప్రమాణాలపై అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈవీఎం గోదాముల వద్ద భద్రతా సిబ్బంది అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. భద్రతా ప్రమాణాలు, లాగ్ బుక్ నిర్వహణ ఇతర అంశాలపై రాజకీయ పార్టీల నేతలతో చర్చించారు. అంతకుముందు కలెక్టరేట్‌లో ఆయన చాంబర్‌లో జరిగిన మాసాంతపు సమావేశంలో డీఆర్వో మాట్లాడారు. ఓటరు జాబితాపై రాజకీయ పార్టీల ప్రతినిధులు తెలిపిన సమస్యలను ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ నెల 30వ తేదీ నాటికి మార్పులు చేర్పులపై సంబంధిత అధికారులకు నివేదిక ఇచ్చినట్లయితే జులై 21న ఓటరు జాబితా విడుదల చేస్తామన్నారు. ఈ జాబితాపై అభ్యంతరాలు అదే నెల 30వ తేదీ లోపు స్వీకరిస్తామన్నారు. ఆగస్టు 2న పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక సమావేశం నిర్వహిస్తామన్నారు. ఓటరు జాబితాలను నాణ్యతగా తయారు చేసేందుకు మరింత మంది బూత్ స్థాయి అధికారులు, ఎలక్టోరల్ అధికారుల నియామకానికి ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. ఒకే డోర్ నంబర్‌లో ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లకు వివిధ వార్డుల్లో ఓట్లు నమోదై ఉన్నాయని, వాటిని సరిచేసి ఒకే చోట చేర్చాలని వైఎస్సార్‌సీపీ నేత జాజుల రమేష్ కోరారు. ఇలా వివిధ రాజకీయ పార్టీ నేతలు లేవనెత్తిన సందేహాలను డీఆర్వో నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక శాఖ జిల్లా అధికారి ఆర్. వెంకటరమణ, జిల్లా ఎన్నికల విభాగం సూపరింటెండెంటు ఎస్.ఎస్.వి.నాయుడు, రాజకీయ పార్టీల ప్రతినిధులు బి. శ్రీనివాసరావు, కె.హరినాథబాబు, ఆర్.శంకరరావు, ఎన్నికల విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

నిమిషానికి ఒకటిన్నర అంశం.. ఇదేం చర్చో?

- నాలుగు గంటల్లో 299 అంశాలపై చర్చ
- జీవీఎంసీ స్థాయీ సంఘ సమావేశంపై విమర్శలు

డాబాగార్డెన్స్: జీవీఎంసీ స్థాయీ సంఘం సమావేశంలో కేవలం నాలుగు గంటల వ్యవధిలో ఏకంగా 299 అజెండా అంశాలపై జరిగిన చర్చ.. చర్చనీయాంశంగా మారింది. సగటున ఒక్కో అంశానికి నిమిషం కన్నా తక్కువ సమయం కేటాయించడంపై, కీలకమైన నగర సమస్యలపై తూతూమంత్రంగా జరిపిన చర్చపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దాదాపు మూడు నెలలు తర్వాత మేయర్ పీలా శ్రీనివాసరావు అధ్యక్షతన శుక్రవారం తొలి స్థాయీ సంఘ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అధికారుల తీరు మొక్కుబడిగా ఉందని మేయర్ చిర్రుబుర్రులాడారు. 'ప్రభుత్వం నుంచి జీతాలు తీసుకుంటూ ఆ మాత్రం పనిచేయకపోతే ఎలా? జీవీఎంసీ ఆస్తులు కాపాడాల్సిన బాధ్యత మీపై లేదా? పూర్తి సమాచారం లేకుండా సమావేశానికి రావొద్దు'అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే, అధికారులకు ఇంతటి క్లాస్ తీసుకున్న మేయర్ అధ్యక్షతన జరిగిన సమావేశం తుఫాన్ వేగంతో ముగియడం విమర్శలకు తావిస్తోంది. ఉదయం 11 గంటలకు ప్రారంభం కావాల్సిన సమావేశం గంట ఆలస్యంగా 12 గంటలకు మొదలైంది. అప్పటి నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, తిరిగి 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు.. అంటే కేవలం నాలుగు గంటల పాటు మాత్రమే సమావేశం జరిగింది. ఈ సమయంలోనే 268 సాధారణ, 13 టేబుల్ అజెండాతో కలిపి మొత్తం 299 అంశాలను సభ్యులు చర్చించారు. వీటిలో 239 అంశాలను ఆమోదించగా, 60 అంశాలను వాయిదా వేశారు. ఇంజినీరింగ్, రెవెన్యూ, కాంట్రాక్టులు, పరిపాలన, ప్రజారోగ్యం వంటి అత్యంత కీలకమైన, అంశాలపై నిమిషాల వ్యవధిలో ఎలా కూలంకషంగా చర్చించి ఉంటారని నగరవాసులు ప్రశ్నిస్తున్నారు. అధికారుల అలసత్వంపై మండిపడి.. ఇలా నామమాత్రంగా సమావేశం ముగించడం ఎంతవరకు సమంజసమని పలువురు అభిప్రాయపడుతున్నారు. సమావేశంలో జోనల్ కమిషనర్లు ఇప్పినాయుడు, కె.శివప్రసాద్, మల్లయ్యనాయుడు, బి.రాము, బీఆర్.ఎస్.శేషాద్రి, హేమావతి, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్, యూసీడీ పీడీ పీఎం సత్యవేణి, సెక్రటరీ బీవీ రమణ, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వాసుదేవరెడ్డి, పరిపాలనాధికారి పద్మజ, పర్యవేక్షక ఇంజనీర్లు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడు దుర్మరణం



లక్ష్మణమూర్తి (ఫైల్)

గొలుగొండ: లింగంపేట సమీపంలో రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఉపాధ్యాయుడు పాంగి లక్ష్మణమూర్తి అక్కడికక్కడే మృతి చెందారు. అల్లూరి జిల్లా నడింపాలెం ఆశ్రమ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న లక్ష్మణమూర్తి నర్సీపట్నం సమీప లక్ష్మీపురంలో నివాసముంటున్నారు. శుక్రవారం ఉదయం పాఠశాలకు వెళ్తుండగా.. గొలుగొండ మండలం లింగంపేట సమీపంలో చోద్యం గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు బైక్‌పై అతివేగంగా వస్తూ ఆయనను బలంగా ఢీకొట్టారు. ఉపాధ్యాయుడు రోడ్డుపై పడి అక్కడకక్కడే దుర్మరణం చెందారు. స్వల్పంగా గాయపడిన ఇద్దరు యువకులను నర్సీపట్నం ఆస్పత్రికి తరలించారు. లక్ష్మణమూర్తి మృతదేహాన్ని గొలుగొండ ఎస్‌ఐ రామారావు పోస్టుమార్టం కోసం నర్సీపట్నం తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బైక్‌పై తరలిస్తున్న 56 కిలోల గంజాయి పట్టివేత



గంజాయి తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్న ఎస్‌ఐ లక్ష్మీనారాయణ

కె.కోటపాడు : ఆనందపురం కూడలి వద్ద ద్విచక్ర వాహనంపై గంజాయిని తరలిస్తున్న తమిళనాడుకు చెందిన చెల్లం తవాసీని ఎ.కోడూరు ఎస్‌ఐ లక్ష్మీనారాయణ శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. ఆనందపురం కూడలి వద్ద సిబ్బందితో కలిసి ఎస్‌ఐ వాహన తనిఖీలు చేస్తున్నారు. ఈ సమయంలో అటువైపుగా ద్విచక్ర వాహనంపై అనుమానాస్పదంగా ప్రయాణిస్తున్న చెల్లం తవాసీని పోలీసులు ఆపారు. వాహనానికి రెండు వైపులా ఉంచిన సంచులను కిందకు దించి తనిఖీలు చేయగా.. 56 కిలోల గంజాయిని గుర్తించారు. ద్విచక్ర వాహనం, నిందితుడి వద్ద ఉన్న సెల్‌ఫోన్‌ను సీజ్ చేసి, చెల్లం తవాసీపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చారు. పట్టుకున్న 56 కిలోల గంజాయి విలువ రూ.2.80 లక్షలు ఉంటుందని ఎస్‌ఐ తెలిపారు.

క్లుప్తంగా

మోడల్ స్కూళ్లలో వసతుల కల్పనపై వినతి



ఎంఈవో కోటేశ్వరరావుకు వినతిపత్రం అందజేస్తున్న మాణిక్యాలరావు

అనకాపల్లి: కూటమి ప్రభుత్వం ఈ ఏడాది కొన్ని ప్రభుత్వ పాఠశాలలను మోడల్ స్కూళ్లగా ఏర్పాటు చేసిందని, వాటిల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి సూదికొండ మాణిక్యాలరావు కోరారు. స్థానిక ఉడ్‌పేటలోని ఎమ్మార్సీ కార్యాలయంలో ఎంఈవో కోటేశ్వరరావకు శుక్రవారం ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు మరింత నాణ్యమైన విద్యను పొందాలని సదుద్దేశంతో ప్రభుత్వం ప్రవేశ పెట్టిన మోడల్ స్కూళ్లలో పూర్తిస్థాయిలో తరగతి గదులు, ఉపాధ్యాయులు, అవసరమైన పరికరాలు పూర్తిస్థాయిలో సమకూర్చాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకుడు వనమాల నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు



గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు వేస్తున్న సిబ్బంది

కశింకోట: పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మండలంలోని తాళ్లపాలెంలో 800 గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందును శుక్రవారం సిబ్బంది వేశారు. వీటిలో 80 మేకలు, మిగిలినవి గొర్రెలు ఉన్నాయి. పశు వైద్యాధికారి డయానా, జేవీవోలు కరుణశ్రీ, సన్యాసిరావు, సచివాలయ సిబ్బంది ఈశ్వరరావు, పాల సంఘం మాజీ అధ్యక్షుడు కర్రి సత్యనారాయణ పాల్గొన్నారు.

పూడికతీత పనులు ప్రారంభం

కశింకోట: మండలంలోని ఏఎస్‌పేట గ్రామం వద్ద నరసాపురం ఆనకట్ట నుంచి మెట్ట సాగు నీటి కాలువలో పూడికతీత పనులకు శుక్రవారం శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా నీటి సంఘం అధ్యక్షుడు ఉప్పలూరి అప్పలనాయుడు భూమిపూజ చేశారు. నీటి సంఘం డైరెక్టర్లు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా నిత్యకల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ బేడా మండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేసి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు శుక్రవారం 70 దిమ్మలు వచ్చాయి

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	---	---
రెండో రకం	---	---
మూడోరకం	2,400	3,200

అనకాపల్లి సినిమాలు

భైరవం	:రాజా
కన్నప్ప	:సత్యనారాయణస్క్రీన్-1
8 వసంతాలు	:సత్యనారాయణ స్క్రీన్-2
కుబేరా	:పర్తిసాయి
సితారే జమీన్ పర్	:షిర్డీసాయి
చంద్రేశ్వర	:వెంకటేశ్వర
కట్టప్ప జడ్జిమెంట్	:శ్రీసత్య
మార్గన్	:రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 72 యూనిట్ల రక్త నిల్వ ఉంది. ఏ పాజిటివ్ 15 యూనిట్లు, బీ పాజిటివ్ -18, ఓ పాజిటివ్ -34, ఏబీ పాజిటివ్ -4 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంక్ టెక్నీషియన్ యు. లోకేష్(9703619706)ను ఫోన్లో సంప్రదించాలని కోరారు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శుక్రవారం 367 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 331 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924-223595 నంబరును సంప్రదించవచ్చు.

వెద పద్ధతికే మొగ్గు





వెద పద్ధతిలో వరి విత్తనాలు చల్లుతున్న రైతు



తుమ్మపాల: పెరిగిన సాగు ఖర్చులతో పోల్చి చూస్తే ధాన్యం ధరలు పెరగకపోవడంతో వ్యవసాయం గిట్టుబాటు కావడం లేదు. ఈ నేపథ్యంలో సాగు వ్యయం తగ్గించుకునే దిశగా అన్నదాతలు అడుగులు వేస్తున్నారు. కూలీల అవసరం లేని వెద సాగు పద్ధతి వైపు మొగ్గు చూపుతున్నారు.

మండలంలో ఖరీఫ్ సాగుకు రైతులు సిద్ధమవుతున్నారు. వరి విత్తనాలతో పాటు వివిధ రకాల పంటలకు నార్లు నాటడం వంటి అన్ని సాగు పనులు ఖరీఫ్‌లోనే జరుగుతాయి. సాధారణంగా జూన్, జూలై నెలలో ప్రారంభమయ్యే తొలకరి వర్షాలలో నారు నాటుతారు. మన ప్రాంతంలో ఖరీఫ్ సీజన్ జూన్‌లో ప్రారంభమై జనవరిలో ముగుస్తుంది. మండలంలో పుష్కలంగా వర్షాలు కురవడంతో దుక్కులు దున్ని వరి విత్తనాలు నాటేందుకు సిద్ధమవుతున్నారు.

ఆరు వేల ఎకరాల్లో వరి సాగుకు సిద్ధం

మండలంలో కొత్తూరు మినహా దాదాపు అన్ని గ్రామాల్లోను రైతులు వరి సాగు చేస్తున్నారు. మండల వ్యాప్తంగా గతేడాది 6,500 ఎకరాల పల్లం భూముల్లో వరి సాగు చేసినట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. ఈ ఏడాది అదే సంఖ్యలో వరి సాగు చేసేందుకు రైతులు ఇప్పటికే నారుమడుల్లో వరి విత్తనాలు వేస్తున్నారు. మిగిలిన సాగు భూముల్లో అధికంగా సరుగుడు, యూకలిప్టస్ సాగుకు మొగ్గుచూపుతున్నారు. కూరగాయలు, ఉద్యాన పంటలు సాగుపైనా ఆసక్తి చూపడంతో క్రమంగా వరి సాగు తగ్గుతోంది.

వెద పద్ధతిపై రైతుల మక్కువ

మండలంలో సగానికి పైగా గ్రామాలు కోడూరు, కొండుపాలెం, గోపాలపురం, మారేడుపూడి, అక్కిరెడ్డిపాలెం, గొలగాం, రేబాక, చింతనిప్పుల అగ్రహారం, మామిడిపాలెం, పాపయ్యపాలెం వగైరా మెట్ట ప్రాంతాలుగా వర్షం ఆధారంగా మాత్రమే వరి సాగు చేస్తుంటారు. సాగునీటి కాలువల సౌకర్యం ఉన్నప్పటికి సాగునీరు వచ్చే పరిస్థితులు కల్పించడంలో ఆయా శాఖల సమన్వయ లోపం కారణంగా సాగునీరు దశాబ్దాల కలగానే మిగిలిపోతుంది. దీంతోపాటు కూలీల కొరత, పెరిగిన ధరలు తట్టుకోలేక రైతుల్లో చాలా మంది ప్రత్యామ్నాయ పంటల సాగువైపు వెళ్లిపోయారు. కొంతమంది రైతులు వరి పండించడంలో వెద పద్ధతిని ఎంపిక చేసుకుని వెద ద్వారా వరి పండిస్తున్నారు. మండలంలో వెద పద్ధతి ద్వారా తుమ్మపాల, శంకరం, రేబాక, మార్టూరు వంటి గ్రామాల్లో 500 ఎకరాలపైగా వరి సాగు వెద పద్ధతిలో జరుగుతుంది. ఈ ఏడాది ఆయా గ్రామాల్లో ఇప్పటికే వెద పద్ధతిలో వరి విత్తనాలు నాటుతున్నారు.

వెద పద్ధతిలో ఖర్చు తక్కువ...



మండలంలో రైతులకు సరిపడా 13,800 క్వింటాళ్ల వరి విత్తనాలు పంపిణీ పూర్తి చేశాం. ఈ ఏడాది అత్యధికంగా సాంబమసూరి విత్తనంపై రైతులు మక్కువ చూపిస్తున్నారు. వర్షాలు కురవడంతో విత్తనాలు వేయడం ఆలస్యమవుతోంది. దీంతోపాటు దమ్ము పద్ధతిలో ఎకరాకు కనీసం రూ.30 వేల వరకు ఖర్చు నాట్లు వరకు అవుతుంది. రైతులు ఈ పద్ధతికి బదులు తక్కువ ఖర్చుతో మంచి దిగుబడి వచ్చే వెద పద్ధతిపై దృష్టి పెడుతున్నారు.

– పీవీబీ రంగాచారి,
మండల వ్యవసాయ అధికారి,
అనకాపల్లి మండలం

జగన్నాథస్వామి ఉత్సవాలు ప్రారంభం



కశింకోటలో జగన్నాథస్వామి రథోత్సవం



తప్పెటగుళ్లు

కశింకోట: దేవాదాయ శాఖకు చెందిన స్థానిక రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో జగన్నాథస్వామి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. దీనిలో భాగంగా శుక్రవారం సాయంత్రం ఆలయం నుంచి జగన్నాథస్వామి, బలభద్రస్వామి, సుభద్రదేవిల విగ్రహాలను అందంగా అలంకరించిన రథంపై నిలిపి పుర వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త రేజేటి శ్రీరామాచార్యులు ఆధ్వర్యంలో ఆలయం నుంచి తప్పెటగుళ్లు, తీన్‌మార్, సన్నాయి మేళాతో సంప్రదాయంగా ప్రారంభమైన రథయాత్ర కోమటి వీధి, పెదబజారు, కస్పావీధి, ఉప్పునీటి దిబ్బ, అమరపల్లి వీధి, పూసర్ల వీధి, జాతీయ రహదారి, సంతబయలు, గవరపేట మధ్యవీధి, వడ్డి వీధుల మీదుగా తిరిగి ఆలయం వరకు రాత్రి పది గంటల ప్రాంతం వరకు సాగింది. యువకులు, మహిళలు ఉత్సాహంగా పాల్గొని స్వామివారి రథాన్ని ఉత్సాహంగా ముందుకు లాగారు. జై జగన్నాథ, గోవింద అంటూ నినాదాలు చేశారు. దారి పొడవునా భక్తులు స్వామివార్లకు భక్తి పారవశ్యంతో నీరాజనాలు పలికారు. రథం చక్రాలపై సంప్రదాయంగా కొబ్బరి కాయలు కొట్టి పండ్లు, పూజా సామగ్రి సమర్పించి పూజలు చేశారు. అర్చకులు రేజేటి సీతారామాచార్యులు, మారుతి, రామచరణాచార్యులు తదితరులు భక్తులకు ప్రసాదాల వితరణ, ఆశీర్వచనాలు ఇచ్చారు. శనివారం నుంచి విష్ణు దశావతారాల్లో రోజుకొక అవతారంతో జగన్నాథస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు వ్యవస్థాపక ధర్మకర్త శ్రీరామాచార్యులు తెలిపారు.

అనకాపల్లిలో నీటి సరఫరాకు అంతరాయం

- 14మంది కాంట్రాక్టు కార్మికుల సమ్మె ప్రభావం

అనకాపల్లి: జోన్ పరిధిలో జీవీఎంసీ నీటిసరఫరా విభాగంలో పనిచేస్తున్న 14మంది కాంట్రాక్టు కార్మికులు శుక్రవారం నుంచి సమ్మెకు దిగారు. తమ సమస్యలు పరిష్కరించాలని కూటమి ప్రభుత్వానికి మొర పెట్టుకున్నప్పటికీ పట్టించుకోకపోవడంతో వీరు విధులకు హాజరు కాలేదు. దీంతో పట్టణంలోని కొన్ని ప్రాంతాల్లో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఈ విభాగంలో 10 మంది పర్మినెంట్ ఉద్యోగులున్నారు. వీరితోనే ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా చూడాలని అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు.

దివ్యాంగులు మనోధైర్యంతో సాగాలి



హెలెన్ కెల్లర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న పాత్రపల్లి వీరుయాదవ్

అనకాపల్లి: దివ్యాంగులు మనోధైర్యంతో ముందుకు సాగాలని విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ సంఘం వ్యవస్థాపకుడు పాత్రపల్లి వీరుయాదవ్ తెలిపారు. శుక్రవారం స్థానిక ఉడ్‌పేట సంఘ కార్యాలయంలో హెలెన్ కెల్లర్ చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగులకు ఉద్యమాల సారధిగా ప్రపంచ స్థాయిలో పేరొందిన హెలెన్ కెల్లర్ ఎందరికో స్ఫూర్తినిచ్చారన్నారు. 19వ శతాబ్దంలో అత్యంత శక్తిమంతులుగా ఆవిర్భవించిన వారు ఇద్దరే ఇద్దరని, ఒకరు నెపోలియన్ అయితే రెండో వారు హెలెన్ కెల్లర్ అని కొనియాడారు. ది స్టోరీ ఆఫ్ మై లైఫ్ గ్రంథ రచనతో తన పుస్తక రచనలకు శ్రీకారం చుట్టి అనేక ప్రఖ్యాత రచనలను వెలువరించారన్నారు. అనంతరం సంఘంలో దివ్యాంగులకు ఫస్ట్ ఎయిడ్ కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ కార్యదర్శి మొల్లి చంద్రశేఖర్, సహాయ కార్యదర్శి యలమర్తి రవి, మొక్క గణేష్, మైలపల్లి గణపతి, దూలి శివ, చెట్టుపల్లి శ్రీనివాసరావు, పచ్చిపాల నర్సింగరావు, గెంజి కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ అమలులో కూటమి విఫలం

వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్



మాట్లాడుతున్న నియోజకవర్గ సమన్వయకర్త భరత్‌కుమార్

అనకాపల్లి: ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేయడంలో విఫలమైనట్లు నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ విమర్శించారు. శుక్రవారం స్థానిక గవరపాలెం ప్రైవేట్ హాల్లో పార్టీ శ్రేణులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిన కూటమి ప్రభుత్వం గ్రామీణ స్థాయి నుంచి అర్హులందరికీ సూపర్ సిక్స్ పథకాలు అమలు చేసే వరకూ పోరాటాలు చేస్తామన్నారు. ప్రతి మహిళకు నెలకు రూ.1500, నిరుద్యోగ భృతి, విద్యార్థులకు ఫీజు రీయంబర్స్‌మెంట్, మహిళలకు ఉచిత బస్సు వంటి అనేక సంక్షేమ పథకాలు అమలు చేయలేదన్నారు. అమ్మ ఒడి పథకాన్ని తల్లికి వందనం పేరు మార్చి పూర్తి స్థాయిలో అమలు చేయకపోవడంతో తల్లులు అనేక ఇబ్బందులు పడుతున్నట్లు వాపోయారు. ఉచిత గ్యాస్ సిలిండర్లు పేరుతో రాష్ట్ర ప్రజలను మరో సారి మోసం చేసిందన్నారు. శనివారం జరిగే వైఎస్సార్‌సీపీ జిల్లా విస్తృత స్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశానికి కార్పొరేటర్లు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పార్టీ అనుబంధ సంఘాల నాయకులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరు కావాలన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, నూకాంబిక అమ్మవారి దేవస్థానం మాజీ డైరెక్టర్ కొణతాల మురళీకృష్ణ, పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు వేగి త్రినాథ్, 80వ వార్డు ఇన్‌చార్జ్ కె.ఎం.నాయుడు, పార్టీ సీనియర్ నాయకులు బొడ్డేడ శివ, పెంటకోట శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్నలో విత్తన శుద్ధి మేలు

అనకాపల్లి: ఖరీఫ్‌లో అధిక దిగుబడినిచ్చే డీహెచ్‌ఎం 117, 119, 121 వంటి మొక్కజొన్న రకాలను ఎకరాకు 8 కిలోల చొప్పున 60 ఇన్‌టూ 20 సెం.మీ. దూరంలో విత్తుకోవాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్ డాక్టర్ సీహెచ్.ముకుందరావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విత్తే ముందు ఫోర్టెమ్టా (సయాంట్రనిలిప్రోల్, థయోమిథాక్సామ్) 6 మి.లీ కిలో విత్తనానికి చొప్పున కలిపి విత్తనశుద్ధి చేసినట్లయితే కత్తెర పురుగు ఉధృతిని కొంత వరకు తగ్గించవచ్చన్నారు. రాగల వర్షాన్ని వినియోగించుకుని చోడి(రాగి) నారుమడి వేసుకునే రైతులు ఇంద్రావతి, వేగావతి శ్రీ చైతన్య వంటి రకాలను ఎంపిక చేసుకోవాలన్నారు. ఎకరానికి 2.5 కిలోల విత్తనం 5 సెంట్ల నారుమడిలో వేసుకోవాలన్నారు. నువ్వుపైరు అధిక తేమను తట్టుకోలేదని, పొలంలో అధిక నీరు చేరినట్లయితే వెంటనే బయటికి తీసివేయాలన్నారు. ఎక్కడైనా పైరులో వేరు కుళ్లుతెగులు కనిపించినట్లయితే కాపర్ ఆక్సీక్లోరైడ్‌ను లీటరు నీటికి 3 గ్రాముల మందును కలిపి మొక్కల మొదళ్లు తడిచేలా పిచికారీ చేయాలన్నారు. వేరుశనగలో నిత్య హరిత, కదిరి లేపాక్షి వంటి అనువైన రకాలతో వేరుశనగ పైరు వేసుకోవచ్చన్నారు. కిలో విత్తనానికి 2 మి.లీ. ఇమిడాక్లోప్రిడ్ 600 ఎఫ్ఎస్ 4 మి.లీ నీళ్ల మిశ్రమం మందుతో విత్తన శుద్ధి చేయాలన్నారు. విత్తనం ఆరిన తర్వాత 2 గ్రా. టేబుకోనజోల్ 2 డిఎస్. మందును పట్టించాలని, రెండు రోజుల తర్వాత అంటే విత్తుకునే ముందు కేజీ విత్తనానికి 10 గ్రాములు లేదా 10 మి.లీ రైజోబియం కల్చరును విత్తనాలను పట్టించాలన్నారు. తీగ జాతి కూరగాయ పంటలను వేసుకోవాలన్నారు.


మెట్రో బస్సులను ఆపాలి

అనకాపల్లి: ప్రజా రవాణాశాఖ(ఆర్టీసీ)లో ప్రయాణికులు కోరినచోట మెట్రో బస్సులను ఆపాలని ఆమ్ ఆద్మీ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కొణతాల హరనాథ్ బాబు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. అనకాపల్లి నుంచి విశాఖకు నిత్యం వేలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారన్నారు. జిల్లా కేంద్రం ఏర్పడిన తర్వాత విశాఖ నుంచి వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ప్రజలు, వ్యాపారులు అనకాపల్లికి వస్తున్నారని, ఉదయం, రాత్రిళ్లు వారు కోరిన చోట నిలుదల చేయడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాత్రి సమయంలో పనులు ముగించుకుని విశాఖకు వెళ్లే సమయంలో వాల్తేరు డిపో బస్సులు ఆపకుండా వెళ్లిపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీనిపై సంబంధిత శాఖాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. అనకాపల్లి, కొప్పాక, కొత్తూరు, సాలాపువానిపాలెం బస్టాప్‌ల్లోనూ మెట్రో బస్సులు ఆపకుండా వెళ్లిపోవడం బాధాకరమన్నారు.

వీధి విక్రయదారుల కమిటీలో సభ్యత్వానికి దరఖాస్తులు

అనకాపల్లి టౌన్: వీధి విక్రయదారుల నగర కమిటీలో అనధికారుల సభ్యత్వం కోసం దరఖాస్తులు చేసుకోవాలని జీవీఎంసీ జోన్-7 కమిషనర్ బి.వి. రమణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీధి విక్రయదారుల చట్టం -2014 జీవో నెంబర్ 137 ప్రకారం వీధి విక్రయదారుల నగర కమిటీలో నలుగురు అనధికార సభ్యులను ఎంపిక చేస్తామన్నారు. వివిధ వ్యాపార వృత్తికి చెందినవారు, నాన్ గవర్నమెంట్ ఆర్గనైజేషన్, కమ్యూనిటీ బేస్డ్ ఆర్గనైజేషన్, రాజకీయ నాయకులకు అవకాశం కల్పిస్తామన్నారు. కమిటీకి చైర్మన్‌గా జోనల్ కమిషనర్ వ్యవహరిస్తారన్నారు. ఎంపిక నామినేషన్ విధానం ద్వారా జరుగుతుందని, మూడేళ్ల కాల పరిమితి గల కమిటీని ఎంపిక చేయుటకు స్ట్రీట్ వెండర్ అసోసియేషన్స్, మార్కెట్ అండ్ ట్రేడ్ అసోసియేషన్, రిజిస్టర్ నాన్ గవర్నమెంట్ ఆర్గనైజేషన్, కమ్యూనిటీ బేస్డ్ ఆర్గనైజేషన్ లైక్ టౌన్ లెవెల్ ఫెడరేషన్ లీడర్, నివాసిత సంక్షేమ సంఘం సభ్యులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తులను రిజిస్టర్ పోస్ట్ ద్వారా గానీ, నేరుగా జోన్ కార్యాలయంలో యూసీడీ విభాగంలో డ్రాఫ్ట్ బాక్స్‌లో ఈ నెల 28వ తేదీ సాయత్రం ఐదు గంటలలోగా అందజేయాలని కోరారు. పూర్తి వివరాలకు యూసీడీ అధికారి వై సంతోష్‌కుమార్‌ను సంప్రదించాలని సూచించారు.

జగన్నాథస్వామి సేవలో వైఎస్సార్‌సీపీ నేతలు



గవరపాలెం సంతోషిమాత అమ్మవారిని దర్శించుకున్న భరత్‌కుమార్, పార్టీ శ్రేణులు

అనకాపల్లి: ప్రశాంతమైన వాతావరణంలో ఉత్సవాలు నిర్వహించుకోవాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ కోరారు. స్థానిక గవరపాలెం 80వ వార్డు ఇన్‌చార్జి కె.ఎం.నాయుడు, రాష్ట్ర గవర కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ బొడ్డేడ శివల ఆధ్వర్యంలో జగన్నాథస్వామి రథోత్సవంలో భాగంగా స్థానిక గూడ్స్‌షెడ్ ఇంద్రద్యుమ్న హాలులో స్వామివారికి శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం జగన్నాథస్వామి ఉత్సవ కమిటీ చైర్మన్ దాడి బుజ్జి భరత్‌కుమార్‌ను శాలువాతో సత్కరించి, ప్రసాదాన్ని అందజేశారు. అంతకుముందు గవరపాలెం రైతు బజార్ వద్ద సంతోషిమాత అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, జగన్నాథస్వామి ఆలయ మాజీ చైర్మన్ దాడి నారాయణరావు, పార్టీ నాయకులు కొణతాల మురళీకృష్ణ, వేగి త్రినాథ్, పెంటకోట శ్రీను, మలసాల కిషోర్, నీటిపల్లి దివాకర్, కలగ లక్ష్మిగున్నయ్యనాయుడు, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన పీఎంఏవై ఇళ్లు పూర్తి

మాకవరపాలెం: పీఎం ఆవాస్ యోజన గృహాల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని హౌసింగ్ డీఈ శ్రీఫణి సూచించారు. తామరంలో శుక్రవారం ఇళ్ల లబ్ధిదారులతో ఆయన మాట్లాడారు. ఈ ఏడాది డిసెంబర్ నాటికి నిర్మాణాలు పూర్తి చేయాలని, లేకుంటే నిధులు మంజూరయ్యే అవకాశం లేదన్నారు. అనంతరం స్థానిక హౌసింగ్ కార్యాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. దశలవారీగా ఇళ్ల నిర్మాణం చేసిన లబ్ధిదారులకు సకాలంలో బిల్లులు అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్‌లు జగన్నాథం, శ్రీను పాల్గొన్నారు.

ఉప్పుటేరులో మళ్లీ చేపల మృత్యువాత



మృతి చెందిన చేపల్ని చూపిస్తున్న మత్స్యకార నేత

అచ్యుతాపురం: మండలంలోని పూడిమడక ఉప్పుటేరులో చేపలు మళ్లీ మృత్యువాతకు గురయ్యాయి. ఫార్మా పరిశ్రమల వ్యర్థాలను ఉప్పుటేరులోకి నేరుగా వదిలేయడంతో తరచూ చేపలు మృత్యువాత పడుతున్నాయి. దీనిపై ఇటీవల మత్స్యకారులు ఆందోళన చేసినా ఎటువంటి ప్రయోజనం లేదని మత్స్యకార నాయకుడు చేపల తాతయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ఫార్మా వ్యర్థాలను నేరుగా ఉప్పుటేరులోకి విడిచిపెట్టకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

బహిరంగ మలవిసర్జనను అరికట్టాలి

రావికమతం: బహిరంగ మల విసర్జనను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో వెంకన్నబాబు తెలిపారు. కార్యదర్శులు,సచివాలయ సిబ్బందితో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్షాకాలంలో అంటు వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యల్లో భాగంగా పారిశుధ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి చెత్తను సేకరించి, సంపద కేంద్రానికి తరలించేలా కృషి చేయాలని చెప్పారు. పంచాయతీల్లో ప్రజలకు అందిస్తున్న సేవలపై ఐవీఆర్ఎస్ ద్వారా ప్రభుత్వం ఆరా తీస్తోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో స్వామి పాల్గొన్నారు.

అప్పన్నకు ఒడిశా దాసుడి ఊంజల్ సేవ



ఉయ్యాలను ఊపుతున్న లక్ష్మీకాంత్ నాయక్‌దాస్, దేవస్థానం ఈవో త్రినాథరావు



ఉంజల్‌సేవ నిర్వహిస్తున్న అర్చకులు



పాల్గొన్న ఒడిశా భక్తులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం ఊంజల్ సేవ ఘనంగా జరిగింది. ఒడిశాకు చెందిన లక్ష్మీకాంత్‌నాయక్‌దాస్ స్వామికి ఈ సేవను విశేషంగా జరిపించారు. పెద్ద సంఖ్యలో ఒడిశా భక్తులు స్వామిని దర్శించుకున్నారు. ఆలయ కల్యాణమండపంలో శేషతల్పంపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేశారు. పుష్పాలతో ద్వాదశి ఆరాధనతో స్వామిని కొలిచారు. లక్ష్మీకాంత్‌నాయక్‌దాస్, దేవస్థానం ఈవో వి.త్రినాథరావు స్వామి వేంజేసిన ఉయ్యాలను ఊపారు. ఒడిశా భక్త బృందం కీర్తనలతో స్వామిని సేవించారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, కరి సీతారామాచార్యులు, అర్చకులు సాతులూరి నరసింహాచార్యులు తదితరులు ఈ సేవను నిర్వహించారు.

కార్మికుల డిమాండ్లు నెరవేర్చాలి

సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింగరావు



మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింగరావు

నర్సీపట్నం: మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్. నర్సింగరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్మికుల దీక్షా శిబిరాన్ని ఆయన శుక్రవారం సందర్శించి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక ఏళ్లుగా పని చేస్తున్నా పర్మినెంట్ చేయకుండా ఔట్‌సోర్సింగ్ పేరుతో శ్రమను దోచుకుంటున్నారని విమర్శించారు. కార్పొరేట్లకు సేవలందిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులను మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జి.కోటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు, యూనియన్ ప్రెసిడెంట్ ఎం.అప్పలనాయుడు, శేఖర్, నాగేంద్ర, దుర్గా తదితరులు పాల్గొన్నారు.